మహిళల రక్షణే లక్ష్యం

వేములవాడ రూరల్, జనవరి 31: మహిళల రక్షణే షీ టీమ్ ప్రధాన లక్ష్యమని జిల్లా షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల పేర్కొన్నారు. బుధవారం వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే నిర్భయంగా షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, కరుణ ఉన్నారు.

దళితబంధుతో భరోసా

కోనరావుపేట, జనవరి 31: కేసీఆర్ ప్రభుత్వం దళితులకు దళితబంధు అందించి భరోసా కల్పించిందని సర్పంచ్ కెంద గంగాధర్ పేర్కొన్నారు. దళితబంధు పథకం కింద బావుసాయిపేటలో నీల, కవితకు రూ.20లక్షలు మంజూరు కాగా, వారు ఏర్పాటు చేసుకున్న ఆయిల్‌మిల్లును స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

యోగా మ్యాట్స్ అందజేత

చందుర్తి, జనవరి 31: కట్టలింగంపేట వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు చందుర్తి ప్రైమరీ స్కూల్ హెచ్ఎం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం యోగా మ్యాట్లు చేశారు. ఇక్కడ ఎంపీటీసీ పులి రేణుక, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ అజీమ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పులి సత్యం ఉన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ

కోనరావుపేట, జనవరి 31: వట్టిమల్లగొల్లపల్లి పాఠశాలకు గ్రామానికి చెందిన నూనె నగేశ్ యాదవ్ రూ.16వేల విలువైన టీవీ అందజేశారు. ఇక్కడ హెచ్ఎం కవిత, సర్పంచ్ గోపు పరశురాములు, ఉప సర్పంచ్ బండ రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీమతి రాయవరపు రాములమ్మ భర్త: శ్రీనివాస్, నివాసం: ఇంటి నెం. 5-3-38, విమల్ టాకీస్ రోడ్, సిరిసిల్ల పట్టణం గారు సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట లొకాలిటిలో కల సర్వే నంబరు 1452, విస్తీర్ణం 939 చదరపు గజాలు ఖాళీ స్థలం గల దానిని బుస్సు భూమలింగం తండ్రి: లచ్చయ్య, నివాసం: సిరిసిల్ల గారి నుండి రిజిస్టర్ విక్రయ దస్తావేజు నెం. 940/2017 ద్వారా ఖరీదు చేసినారు. ఇట్టి దస్తావేజు యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ రిజిస్టర్ విక్రయ దస్తావేజు నెం. 1941/2008 మరియు విక్రయ దస్తావేజు నెం. 2439/1982 పోయినదని నా క్లయింట్ రాయవరపు రాములమ్మ గారు తెలిపినారు.

కావున ఇట్టి దస్తావేజులు దొరికిన వారు పై చిరునామాలో గల నా క్లయింటుకు లేదా క్రింది చిరునామాలో గల వారికి అందజేయగలరు. మరియు ఇట్టి దస్తావేజుల పై గాని లేదా పై ప్రాపర్టీపై గాని ఎవరికైన అభ్యంతరములు ఉన్న యెడల వ్రాతపూర్వక ఆధారములతో (7) రోజులలో క్రింది చిరునామాలో గల వారికి తెలుపగలరు. గడువు తదుపరి వచ్చిన అభ్యంతరములు చెల్లనేరవు.

తేది: 31-01-2024

Sd/- **S. MOHAN KUMAR,**
Advocate, Sircilla. Cell: 94401 46081

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★**హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను,** పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319428-All

CHANGE OF NAME

★**Jupelly Chandana, W/o. Venkateshwar Rao,** H.No.3-25, Peddur, Sircilla mandal, Rajanna Sircilla Dist, TS, have my name changed as **PALTHINENI SINDHUJA W/O. VENKATESHWAR RAO.**
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

గంభీరావుపేట: జీపీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

చందుర్తి: పాలకవర్గ సభ్యులను సన్మానించిన సర్పంచ్ దమ్మ అంజయ్య

సర్పంచులకు ఘన వీడ్కోలు

- పదవీకాలం ముగియడంతో పాలకవర్గాలకు సన్మానం

సర్పంచుల పదవీకాలం ముగియడంతో పలు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం పాలకవర్గంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచులు, ఉప సర్పంచుల తోపాటు వార్డు సభ్యులను గ్రామస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించి ఘన వీడ్కోలు పలికారు. ఐదేండ్లల్లో పాలకవర్గ సభ్యులు అందించిన సేవలను కొనియాడారు. గ్రామాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ప్రశంసించారు.

– ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/ముస్తాబాద్/ఇల్లంతకుంట/చందుర్తి, జనవరి 31

ఇల్లంతకుంట: మండల పరిషత్‌లో సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ వెంకటరమణారెడ్డి

● గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని ఎంపీటీసీ కవిత, బీఆర్ఎస్ నాయకుడు అంబర్‌నాయక్ సన్మానించారు. మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో దమ్మన్నపేట అభివృద్ధిలో దూసుకెళ్లిందని ఉపసర్పంచ్ అరుట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. నూతన జీపీ భవనానికి నర్రా లక్ష్మి కొడుకు బాల్‌రెడ్డి వారి తాత అరుట్ల జ్ఞాపకార్థం సుమారు రూ.20లక్షల విలువైన 400గజాల స్థలం ఇచ్చారని గుర్తు చేశారు. ఇక్కడ సర్పంచ్ సిరిగిరి లక్ష్మి, ఉప సర్పంచ్ అరుట్ల అంజిరెడ్డి, ఎంపీటీసీ కవిత, తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇచ్చిన ప్రతీ సర్పంచ్‌కు కొండాపురం బాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సర్పంచ్, పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. గొల్లపల్లిలో పారిశుధ్య కార్మికులకు వార్డు సభ్యురాలు దాసరి గణేశ్-పూర్ణిమ దంపతులు విందు భోజనం ఏర్పాటు చేసి సన్మానించారు. ఇక్కడ సర్పంచ్ పాశం సరోజన, తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్ మండలం మద్దికుంటలో సర్పంచ్ దంపతులు జనగామ భాగ్యశ్రీ – శరత్‌రావు (ఎంపీపీ)ను పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు సన్మానించారు. అనంతరం ఉప సర్పంచ్ కదిరె బేమయ్య, వార్డు సభ్యులు, సిబ్బందిని సర్పంచ్ దంపతులు సత్కరించారు. సఫాయి కార్మికులను నూతన వస్త్రాలు అందించి కొంత పారితోషికం అందించారు. అలాగే తుర్కపల్లి తోపాటు పలు గ్రామాల్లో పాలకవర్గాలను నాయకులు సన్మానించారు.

● ఇల్లంతకుంట మండల పరిషత్‌లో మండల సర్పంచులను ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణరెడ్డి శాలువాలు కప్పి సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు స్ఫూర్తిదాయకంగా పని చేశారని కొనియాడారు. ఇక్కడ ఎంపీడీవో మీర్జా, సర్పంచులఫోరం మండల అధ్యక్షుడు చల్ల నారాయణ ఉన్నారు.

● చందుర్తి మండలం రామన్నపేట గ్రామ పంచాయతీలో పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు, జీపీ సిబ్బంది, ఉపాధ్యాయులను సర్పంచ్ దుమ్ము అంజయ్య సన్మానించారు. ఇక్కడ ఉప సర్పంచ్ చింతం భూలక్ష్మి, కార్యదర్శి సందీప్, వార్డు సభ్యులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: గొల్లపల్లిలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న వార్డు సభ్యురాలు గణేశ్-పూర్ణిమ దంపతులు

ముస్తాబాద్: మద్దికుంట జీపీలో ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- జిల్లాలోని పాన్, కిరాణాషాపుల్లో తనిఖీలు

జిల్లా కేంద్రంలోని పాన్‌షాప్‌ను తనిఖీ చేస్తున్న సిరిసిల్ల డీఎస్పీ

వేములవాడ/ తెలంగాణ చౌక్, జనవరి 31: గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. బుధవారం జిల్లాలోని పలు పాన్, కిరాణాషాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మత్తుపదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తున్నదని పేర్కొన్నారు. జిల్లాలోని పాన్ షాప్‌లపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను ఎవరైనా విక్రయిస్తే మెసేజ్ యువర్ ఎస్పీ 63039-22572 నంబర్‌కి గానీ, డయల్ 100 నంబర్‌కి గానీ కాల్ చేయాలని సూచించారు. వేములవాడ పట్టణంలోని పాన్‌షాప్‌లను సీఐ కరుణాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న అనుమానాల నేపథ్యంలో పట్టణంలోని 36పాన్‌షాప్‌లను తనిఖీ చేశారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ కరుణాకర్ హెచ్చరించారు.

మైనార్టీ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి

- మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి గంగయ్య
- జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం

కలెక్టరేట్, జనవరి 31: జిల్లాలోని మైనార్టీ కళాశాలలు, పాఠశాలల్లో మైనార్టీ విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో చేర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బొడ్డుల గంగయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని రీజినల్ కోఆర్డినేటర్, జిల్లా విజిలెన్స్ అధికారులు, సంబంధిత ప్రిన్సిపాళ్లతో సమావేశమై మాట్లాడారు. ఐదో తరగతి నుంచి ఇంటర్ (ఎంపీసీ, బీపీసీ మొదటి సంవత్సరం) ప్రవేశాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రవేశాల గురించి మైనార్టీ జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ సిరిసిల్ల మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్ (ఎంపీసీ, బీపీసీ మొదటి సంవత్సరం), వేములవాడ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్ ఎంఎల్‌టీ, ఎల్ఎంఅండ్ డీటీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డెయిరీ టెక్నాలజీ) వృత్తి విద్యా కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశం పొందడానికి అర్హత గల విద్యార్థులు వెబ్‌సైట్ (www.tmreis.telangana.gov.in) ద్వారా ఈ నెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఓఎస్‌డీ ఎండీ సర్వర్‌మియా, విజిలెన్స్ జిల్లా అధికారి షౌకత్‌అలీ, అహ్మద్‌అలీ, ప్రిన్సిపాళ్లు ఉరూస్ ఫాతిమా, రాజేశ్ పాల్గొన్నారు.

అలరించిన సంగీతామృతం

- వేములవాడలో రెండోరోజూ త్యాగరాజ ఆరాధనోత్సవాలు

సంగీత కచేరి చేస్తున్న సతీందర్ బృందం

వేములవాడ టౌన్, జనవరి 31: వేములవాడ రాజన్న సన్నిధిలో త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం 10 గంటలకు శిఖామణి భాగవతారిణి చెప్పిన హరికథ, మధ్యాహ్నం 3గంటలకు జయకృష్ణ భాగవతార్ చెప్పిన హరికథ భక్తుల మనసులను రంజింపజేశాయి. సాయంత్రం 4.30 గంటలకు కొరిడె నరహరిశర్మ బృందం భక్తి సంగీతం, 5.30 గంటలకు డీవీమోహన కృష్ణ శాస్త్రీయ సంగీత కచేరి శ్రోతలను ఆనంద డోలికల్లో ముంచెత్తింది. రాత్రి 8గంటలకు వేములవాడకు చెందిన నందగిరి సతీందర్, రాగంపేట విజయశ్రీ, దీవన్నగారి శ్రీదేవి, శరణ్య, అశ్విని సంగీత కచేరితో త్యాగరాజస్వామికి సంగీత నీరాజనాలర్పించారు. వ్యాఖ్యాతలుగా కేఎస్ అనంతచార్య, మాడిశెట్టి గోపాల్ వ్యవహరించారు. ఉత్సవాల ఇన్‌చార్జి కొంటికర్ల రామయ్యశర్మ, మధు శ్రీనివాస్ ఉన్నారు.

సబ్ జూనియర్స్ రన్నింగ్ పోటీలు

సిరిసిల్ల టౌన్, జనవరి 31: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీలు నిర్వహించారు. అండర్-8, 10, 12, 14 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన పోటీలను అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ప్రారంభించారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్ 50, 100, 300, 400, 600 మీటర్ల విభాగాలతోపాటు బ్రాడ్‌జంప్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించినట్లు చంద్రశేఖర్ తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన 25మంది క్రీడాకారులు ఈ నెల 10న భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇక్కడ రవి, విజయ్, అజయ్‌కుమార్, బాబు, శ్రీనివాస్, వినోద్‌కుమార్, సాయికుమార్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

రాజన్న సిరిసిల్ల, జనవరి 31 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెంలో ఈ నెల 10న జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి 25 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. బుధవారం స్థానిక మినీ స్టేడియంలో ఎనిమిది నుంచి 14 ఏండ్ల బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. 200మంది పాల్గొన్న ఈ పోటీల్లో 25 మంది రాష్ట్ర స్థాయికి ఎం పికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేశారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటేలా శిక్షణ ఇచ్చామన్నారు. ఇ క్కడ పీఈటీలు అజయ్‌కుమార్, బాబు, శ్రీనివాస్, వినోద్‌కుమార్ ఉన్నారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందిస్తున్న జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

కోనరావుపేట, జనవరి 31: కనగర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని సహస్ర రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో సబ్ జూనియర్ అథ్లెటిక్స్ అండర్-10 విభాగంలో వంద మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్‌లో సహస్ర జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈనెల 10న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సహస్ర పాల్గొంటుందన్నారు. ఇక్కడ హెచ్ఎం దేవదాస్, మధు, పీఈటీ అజయ్, టీచర్ శ్రీనివాస్ ఉన్నారు.

'రంగినేని ట్రస్టు' లో ప్రవేశాలకు ఆహ్వానం

సిరిసిల్ల రూరల్, జనవరి 31: మున్సిపల్ పరిధిలోని రగుడులో రంగనేని ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తూడి వెంకట్రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లిష్ మాధ్యమంలో అవాస విద్యనందిస్తున్నామని, ఈ నెల 20లోగా విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మార్చి ప్రవేశ పరీక్ష ఉంటుందని, జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభంకానున్నట్లు చెప్పారు. ఆరో తరగతిలో 5, ఏడో తరగతిలో 11, ఎనిమిదిలో 12, తొమ్మిదిలో ఏడు, పదో తరగతిలో 14సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం నంబర్లలో (9290687853, 9849012459, 9490733232) సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో చేరండి..

- పలు గ్రామాల్లో అధ్యాపకుల ప్రచారం

రుద్రంగి, జనవరి 31: ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించడంతోపాటు నాణ్యమైన విద్య కోసం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి.. అంటూ కళాశాల అధ్యాపకులు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుదీర్ఘ అనుభవం కలిగిన అధ్యాపకులతో డిజిటల్ తరగతుల ద్వారా నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు చెప్పారు.

భయం వీడి పరీక్షలు రాయాలి

ముస్తాబాద్, జనవరి 31: విద్యార్థులు రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో భయం వీడి పరీక్షలు రాయాలని, వందశాతం ఫలితాలే లక్ష్యంగా కష్టపడి చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, నామాపూర్‌లోని మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు చేసి సమాధానాలు రాబట్టారు. సమయం దగ్గరపడిన కొద్ది ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా వినాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. తర్వాత బాలుర, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. అనంతరం ముస్తాబాద్‌లో నిర్మిస్తున్న పాఠశాల నూతన భవనం పనులు పూర్తి చేయాలన్నారు. ఇక్కడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, రవీందర్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

విద్యార్థికి నగదు బహుమతి

వేములవాడ, జనవరి31: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థి ముత్యం యశ్వంత్ (9వ తరగతి) ఆగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన సైన్స్‌ఫేయిర్‌లో ప్రతిభ చూపింది. ఫౌండేషన్ ద్వారా రూ.5 వేలు వితరణ చేయగా, ఎంఈ వో బన్నాజీ బుధవారం అందజేశారు. సులభంగా బల్బును తొలగించే కర్రను తయారుచేసిన యశ్వంత్, గైడ్ టీచర్ రాధికను అభినందించారు.

హెచ్ఎండీఎస్ స్టాప్ లోన్ విడుదల చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డి
- వీటీడీఏ అధికారులతో సమీక్ష

సీఎం రేవంత్‌రెడ్డికి అభివృద్ధి ప్రణాళికలపై వివరిస్తున్న దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ అనురాగ్‌జయంతి

వేములవాడ, జనవరి 31: రాజన్న ఆలయ అభివృద్ధికి గతంలో జారీచేసిన హెచ్ఎండీఎస్ స్టాప్ లోన్ రూ.20కోట్లను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నిధులతో బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి, శివార్చన వేదిక నిర్మాణం, గుడిచెరువు సుందరీకరణ, నట్‌రాజ్ విగ్రహం ఏర్పాటు, పార్క్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. బుధవారం ఆయన సచివాలయంలో వీటీడీఏ అధికారులతో సమీక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎం ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి పాల్గొన్న సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రస్తుతం కొనసాగుతున్న, చేపట్టాల్సిన పనులను వివరించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మూలవాగు వంతెన నుంచి 800మీటర్ల మేర ప్రధాన రహదారిని విస్తరించాలన్నారు. ఇందుకు అవసరమైన రూ.35కోట్లు త్వరలోనే విడుదల చేయాలని సూచించారు. గుడి చెరువులో మురుగు నీరు కలువకుండా, నూతన కాలువ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు వివరించారు. సమావేశంలో హెచ్ఎండీఏ కమిషనర్ దాన కిశోర్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అదనపు కలెక్టర్ పుజారి గౌతమి, వీటీడీఏ కార్యదర్శి అన్సారీ, ఈవో కృష్ణప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఈఈ రాజేశ్, టౌన్ ప్లానింగ్ అధికారి చంద్రిక ఉన్నారు.

సర్పంచుల పాత్ర కీలకం

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

వేములవాడ రూరల్, జనవరి 31: గ్రామాల సమగ్రాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. బుధవారం వేములవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన నిర్వహించగా, చైర్‌పర్సన్ హాజరయ్యారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, అభివృద్ధికి పాటుపడిన సర్పంచులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముందుగా సమావేశంలో అధికారులు తమ ఎజెండా అంశాలను వివరించారు. అనంతరం సర్పంచులను సన్మానించారు. ఇ క్కడ ఎంపీడీవో రాంరెడ్డి, తహసీల్దార్ సుజాత, వైస్ ఎంపీపీ కవిత, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సిరిసిల్ల టౌన్, జనవరి 31: రాబోయే వేసవిలో మున్సిపల్ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సర్వసభ్య సమావేశం అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఎజెండా వివరాలను వెల్లడించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పైపులైన్ ఏర్పాటు కోసం రూ.25లక్షలు కేటాయించేందుకు ఆమోదం తెలిపామన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా మున్సిపల్ సంబంధిత డంప్‌యార్డులో పవర్ బోర్ ఏర్పాటు తోపాటు అవసరమైన చోట ప్రహరీ నిర్మాణం చేపటనున్నట్లు తెలిపారు. పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్నామని, రాబోయే ఏడాదిలో పారదర్శకమైన పాలన అందించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తవుటు కనకయ్య మృతికి నివాళులర్పించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ అయాజ్ పాల్గొన్నారు.

ఆ నాలుగు కోడెలు ఎక్కడివి?

- జనవరి 2న జనగామలో పట్టుకున్న పోలీసులు
- వాహనం సీజ్.. గోశాలకు కోడెల తరలింపు
- రాజన్న కోడెల తరలింపుపై సమగ్ర విచారణ

వేములవాడ, జనవరి31: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధికి వచ్చే భక్తులు కోడె మొక్కును అత్యంత పవిత్రతగా భావిస్తుంటారు. ఏడాదికి సుమారు రూ.25కోట్లకు పైగా స్వామివారికి సింహాభాగం ఆదాయం వీటి నుంచే సమకూరుతున్నది. భక్తులు సమర్పించిన కోడెలను గోశాలల పేరిట రైతులకు తరలిస్తుండగా, చేతులు మారి అక్రమాలకు తెరలేపుతున్నాయి. గత జనవరి 2న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం దుబ్బతండాలోని శ్రీ సోమేశ్వర గోసంరక్షణ సేవా సంఘానికి 20కోడెలు అందజేసినట్లు రికార్డు నమోదు చేశారు. అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీ చేయగా, వాహనంలో 24కోడెలు ఉన్నాయి. అదనంగా నాలుగు కోడెలు ఎక్కడివనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి, కోడెలను గోశాలకు తరలించారు. రాజన్న సన్నిధి నుంచి అక్రమంగా కోడెలు తరలిస్తున్నారా? లేదా పట్టుకెళ్లే గోశాల నిర్వాహకులే అక్రమాలకు పాల్పడుతున్నారా? అనే కోణంలో పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ క్రమంలో రాజన్న ఆలయ గోశాల విభాగాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులు రెండు రోజుల క్రితం విచారణ చేసినట్లు తెలిసింది. గోశాలలోని కోడెల రికార్డులు, సంబంధిత విభాగం ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించారు. గోశాల నిర్వహణకు సంబంధించి ఉద్యోగుల వివరాలను అధికారికంగా తెలుపాలని లేఖ ద్వారా ఈవోకు అందజేసినట్లు తెలిసింది. పోలీసులు విచారణ చేపట్టడంతో ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

బోయినపల్లి, జనవరి 31: మహనీయుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. బుధవారం ఆయన మర్లపేటల